## క్లుప్తంగా

### జంతుశాస్త్రం బోధనకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ టౌన్: జంతుశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపక ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి. ప్రభాకరరావు గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలిగిన అధ్యాపకులు సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం కనీస మార్కులతో పీజీ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అధ్యాపకులు ఈ నెల 16న కళాశాలలో హాజరు కావాలన్నారు. అలాగే 2023 మార్చి, జూన్ నెలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, సంబంధిత విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలను పొందవలసిందిగా కోరారు.

### నేడు బొల్లాపల్లి పరిషత్ సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా గురువారం తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటకు ప్రారంభమవుతుందని మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు. అత్యవసరం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సదరు ఎంపీటీసీ సభ్యులు చర్చకు తీసుకొచ్చిన అంశాలు, వివిధ శాఖల ప్రగతికి సంబంధించి అజెండా అంశాలుగా సమావేశంలో చర్చించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.

### నేడు జగనన్న ఆరోగ్య సరక్ష శిబిరాలు ఇక్కడే..

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామ సచివాలయ పరిధిలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో 21 మంది వలంటీర్లు ఉండగా 1544 నివాస గృహాలు ఉన్నాయని 95 శాతం నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

**కనపర్రులో ...**

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్యాంపు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, అధికారులు, నాయకులు పాల్గొంటారన్నారు. గణపవరం, నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యులు, కాటూరి వైద్యశాల వైద్య బృందం హాజరుకానున్నందున గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా నమోదు చేయాలి

శావల్యాపురం: ఖరీఫ్ సీజనులో పంటలు సాగు చేసిన రైతులందరూ ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా చేయించాలని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడుతూ మండలంలో 2182 ఎకరాలు వివిధ రకాల పంటలను సాగు చేయగా 98 శాతం ఈకేవైసీ నమోదు పూర్తి అయిందన్నారు. నూజెండ్ల మండలం 4985 ఎకరాలు సాగు చేయగా 4315 ఎకరాలు ఈకేవైసీ నమోదు అయిందన్నారు. వినుకొండ రూరల్-6799 ఎకరాలు సాగు చేయగా 6 వేల ఎకరాలు ఈకేవైసీ చేశామన్నారు. ఈపూరు మండలం 4562 ఎకరాలకు గాను 3928 ఈకేవైసీ నమోదు జరిగినట్లు చెప్పారు. బొల్లాపల్లి మండలం 17556 ఎకరాలు పంటలు సాగు చేయగా 13246 ఎకరాలు ఈకేవైసీ నమోదు పూర్తి అయిందని త్వరితగతిన నమోదు ప్రక్రియ నూరు శాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. రబీ సీజనుకు సంబంధించి అన్నీ రైతుభరోసా కేంద్రాలలో రాయితీపై రైతులకు శనగలు 40 శాతం మినుములు 80 శాతం రాయితీపై ఒక్కో రైతుకు 5 ఎకరాలు చొప్పున మంజూరు చేస్తున్నామన్నారు. శావల్యాపురం మండలంలో అన్నీ రైతు భరోసా కేంద్రాలకు శనగలు, మినుములు నిల్వలు వచ్చినట్లు త్వరలో రైతులకు రాయితీపై ఇస్తామన్నారు. శనగలు, మినుములు ప్రతి రైతుకు అందేలా సరిపడా నిల్వలు వచ్చినట్లు ఏడీఏ రవిబాబు తెలిపారు. ఆయనతో పాటు ఏవో రామినేని రామారావు, ఉన్నారు.

### శ్రీ చైతన్యలో సిరిడెంటల్ ఉచిత వైద్యశిబిరం

నరసరావుపేట: పట్టణంలోని శ్రీ చైతన్య స్కూలులో సిరిడెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల పళ్లను డాక్టర్లు పరీక్షించారు. చాలామంది దంత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశారు. మరింతగా వైద్యం కావల్సిన వారు తమ వైద్యశాలను సందర్శించాలని సీఎండీ సీహెచ్. బాలస్వామి తెలిపారు.

### అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

బొల్లాపల్లి: విద్యుదాఘాతంతో రెండు పూరిల్లు దగ్ధమైన సంఘటనలో బాధితులకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వితరణ గురువారం అందజేశారు. మండలంలోని మూగచింతలపాలెం గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో మిరియంపల్లి శ్రీనివాసరావు, ఈపూరు కోటేశ్వరరావులకు సంబంధించిన పూరిళ్లు గతంలో ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం బాధితులకు చేయూతనందజేశారు. పార్టీ యువ నాయకులు బొల్లా గిరిబాబు ఆధ్వర్యంలో బాధితులకు బియ్యం, వంట సామగ్రి, దుస్తులు, నగదు అందజేశారు. పక్కా ఇళ్లు నిర్మించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎం.రాజయ్య, బి.గురవయ్య, కె.బంగారయ్య, పి.అవినాష్‌రెడ్డి, పి.జార్జీ, ఎం.నాసరయ్య, పేరయ్య పాల్గొన్నారు.


కాకానిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


కాకానిలో రోగులకు చికిత్స అందజేస్తున్న డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం


కాకానిలో రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మాచవరం శిబిరంలో ఓ వృద్ధురాలికి బీపీ పరీక్ష చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


మాచవరం గ్రామ శిబిరంలో గ్రామస్తులకు బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

# జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కిటకిట

- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న రోగులు
- వేర్వేరు గ్రామాల్లో విస్తృతంగా వైద్య సేవలు

నరసరావుపేట రూరల్: మండలంలోని కాకానిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అడపా దుర్గాప్రసాద్, ఎంపీటీసీ దండా వీరాంజనేయులు ప్రారంభించారు. వైద్య శిబిరానికి 422 మంది హాజరు కాగా వీరిలో 242 మంది మహిళలు, 180 మంది పురుషులు, 84 మంది విద్యార్థులు ఉన్నారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 164 మందికి పరీక్షలు నిర్వహించి 80 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కోటప్పకొండ, పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వి.మమతా ప్రియ, డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం, పిల్లల వైద్యుడు డాక్టర్ పవన్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, కంటి వైద్య నిపుణులు జి.గ్రేసిలు రోగులకు పరీక్షలు నిర్వహించారు.

**మాచవరంలో ....**

నరసరావుపేట: గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి అనారోగ్య సమస్యకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రొంపిచర్ల మండలంలోని మాచవరం గ్రామంలో ఎంపీయుపీ స్కూల్లో గురువారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వైద్య అధికారాలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 15 వేల సచివాలయాల్లో ప్రతిరోజు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మాచవరం గ్రామంలో 218 మందికి టోకెన్ జనరేట్ చేయడం జరిగిందని వారందరికీ ఇక్కడ వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. గ్రామీణ స్థాయిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి టోకెన్ జనరేట్ చేసే సమయంలో ఒకవేళ అందుబాటులో లేకపోయినా వైద్యశిబిరానికి వచ్చి కూడా వైద్యసేవలు పొందవచ్చునని, అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు లభిస్తాయన్నారు. నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు కంటి వైద్య డాక్టర్ వైద్యసేవలు అందించారన్నారు. ఉచితంగా కళ్లజోళ్లు కూడా పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


కాకానిలో ఓపీ విభాగం వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

**తిమ్మాపురం క్యాంపునకు అనూహ్య స్పందన**

యడ్లపాడు: వైద్యరంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని .. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ గోపీనాయక్ చెప్పారు. మండలంలోని దింతెనపాడు, తిమ్మాపురం గ్రామ ప్రజలకు గ్రామ సచివాలయం పరిధిలోని జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెండు గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో శిబిరానికి తరలివచ్చారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వేలో వివిధ అనారోగ్య పరీక్షలను నిర్వహించుకున్న 444 మందికి కూపన్లు ఇవ్వగా, నేరుగా కూపన్లతో పనిలేకుండా వచ్చిన మరో 46 మంది క్యాంపులో ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అందరికీ కేస్‌షీట్లను ఇచ్చి ఎత్తు, బరువుల కొలతలతోపాటు బీపీ, షుగర్, ఈజీజీ వివిధ రక్త పరీక్షలను నిర్వహించారు. అనంతరం వైద్యుల శిబిరాలకు పంపించారు. ఆయా శిబిరాలకు హాజరైన పీహెచ్‌సీ వైద్యులు ఆర్ గోపీనాయక్, స్పెషలిస్టు డాక్టర్లు ఎ.సంతోష్‌కుమార్, రమ్యతసాయి, దీపికా 490 మంది ఓపీలను చూశారు. వారందరికీ ఉచితంగా మందులు అందజేసి, ఆస్పత్రి చికిత్స అవసరమైన వారిని గుర్తించి వారి వ్యాధిని బట్టి 22 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. ఇదే శిబిరంలో ప్రత్యేక కౌంటర్ నందు బి.ప్రతాప్ 218 మందికి కంటి సంబంధిత పరీక్షల్ని నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఇచ్చేలా వారి పేర్లను నమోదు చేసుకున్నారు. గురువారం నిర్వహించిన శిబిరంలో కేవలం 222 మంది ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యుల వద్ద చూపించుకోవడం విశేషం. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార వంటకాల ప్రదర్శనను శిబిరానికి వచ్చిన వారికి చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పుల్లగూర ప్రభావతి, ఎంపీడీవో వై హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధుని, సీహెచ్‌వో ఎస్ పున్నారావు, ఐసీడీఎస్ ఏసీడీపీవో బి నిర్మల, యడ్లపాడు సెక్టార్ సూపర్‌వైజర్ కె.వెంకటరమణ, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొని తమ సేవల్ని అందించారు.

**పలుకూరులో...**

బొల్లాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలుకూరు సచివాలయం వద్ద సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంకా ఎల్లమ్మ, ఎలగాల ఎల్లమ్మ, బి. దేవ్లీబాయి, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వెల్లటూరు వైద్యాధికారి జి. వీరనరేష్, బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఎం. సాయి వినూత్న, ప్రత్యేక వైద్య నిపుణులు బి.రాంబాబు, పిడియాట్రీషియన్ బి. రత్నవాణి, గైనకాలజీ వైద్యులు వైద్య చికిత్సలు అందజేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యసేవలు పొందారని, వీరిలో 90 మందికి కంటి వైద్య పరీక్షలు చేశామని, నలుగురిని వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని ఆరోగ్యశ్రీ ద్వారా పలు వైద్యశాలలకు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి జి.వీరనరేష్ తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. పౌష్టికాహారం ద్వారా రక్తహీనత నివారణ ఉంటుందని, ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ ఎస్.కె.మౌలాలీ, ఇన్‌చార్జి ఎంపిడిఓ షేక్ జిలానీబాషా, జి.శ్రీహరి, బత్తుల గోవిందయ్య, బంకా పిచ్చయ్య, రమేష్ పాల్గొన్నారు.


మాచవరం గ్రామ శిబిరంలో గ్రామస్తులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


తిమ్మాపురం క్యాంపులో ప్రతి ఒక్కరిని ఎత్తు, బరువు కొలతలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది


తిమ్మాపురం జేఏఎస్ క్యాంపులో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది


పలుకూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


పలుకూరులో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


తిమ్మాపురం సురక్ష శిబిరంలో ఓపీ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వైద్య సిబ్బంది

## సామాన్యుడి చేతిలో వజ్రాయుధం సమాచార చట్టం

నరసరావుపేట రూరల్: సామాన్యుడి చేతిలో వజ్రాయుధంలా సమాచార హక్కు చట్టం పనిచేస్తుందని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బి. సలీం తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సలీంతో పాటు సీనియర్ న్యాయవాది ఎం.ఆరోగ్యం చౌదరిలు ముఖ్యఅతిథులుగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత జవాబుదారీతనం తీసుకురావడం కోసం, అధికార యంత్రాంగాల వద్ద ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు సవ్యంగా పనిచేసేందుకు, అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వ విభాగాలు ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు ప్రజలకు విషయపరిజ్ఞానం ఎంతో అవసరమని తెలిపారు. ప్రజాపరిశీలన ద్వారా అవినీతిని అరికట్టడంతో పాటు అధికార యంత్రాగంలో పారదర్శకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సలీం

## కానిస్టేబుల్ ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: అనారోగ్య కారణాలతో కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన 60 అడుగుల రోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌లో చిన్నపు రాజేష్ (40) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా రాజేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం భార్య ఇంట్లో లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బంధువుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

### 15 నుంచి నవరాత్రి ఉత్సవాలు

రొంపిచర్ల: మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని దేవస్థానం అధ్యక్షులు రామచంద్రరావు తెలిపారు. మొదటి రోజు బాల అలంకారం, రెండవ రోజు కోమారిదేవి అలంకారం, మూడవ రోజు వైష్ణవి అలంకారం, నాల్గవ రోజు మహంకాళి అలంకారం, ఐదవ రోజు లక్ష్మీదేవి అలంకారం, ఆరవ రోజు సరస్వతీ దేవి అలంకారం, ఏడవ రోజు దుర్గాదేవి అలంకారం, ఎనిమిదవ రోజు మహిషాసురమర్దని అలంకారం, తొమ్మిదవ రోజు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

## క్రీడా వార్తలు....

### విద్యార్థుల ఎంపిక అభినందనీయం


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని పసుమర్రు ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.హనుమంత రావు చెప్పారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సీహెచ్ డేవిడ్ బాల్ బాడ్మింటన్, ఎం.ప్రశాంత్ షూట్‌బాల్, షేక్ నౌషిక్, పఠాన్ అల్తాఫ్ నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఇతర విద్యార్థులు క్రీడలపరంగా ఉన్నతస్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పఠాన్ ఖాదర్ మస్తాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ యర్రం వెంకట సుబ్బయ్య, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసిన్ పాల్గొన్నారు.

### బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు ఎంపికైన నిర్మలా విద్యార్థులు


మొదటి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): ఇటీవల పొనుగుపాడులో జరిగిన ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వినుకొండ నియోజకవర్గం జట్టు మొదటి స్థానం సాధించినట్లు నిర్మలా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ సుపీరియర్ సిస్టర్ క్యాస్పర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జట్టులో నిర్మలా పాఠశాల విద్యార్థులు ఉన్నారని, జిల్లా టీం ఎంపికలో పాఠశాలకు చెందిన సాయికుఆర్, రోహిత్‌కుమార్‌లను అర్హత సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ డెన్నిస్, హెచ్ఎం సిస్టర్ రాణి, చిన్ని, సిస్టర్ బెనిడిక్టా, వ్యాయామ ఉపాధ్యాయులు రాధాకృష్ణ, కోచ్ నాయక్ అభినందించారు.

### శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి 54వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయంలో గురు వారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మిత్తింటి కృష్ణాంజనేయులు, నేరెళ్ల వెంకట పాపారావు, పెనుగొండ రమేష్, పెండేల శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు, ప్రకాష్ బాబు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, నరసింహారావు పాల్గొన్నారు.

### నాదెండ్లలో మేరా మట్టి మేరా దేశ్

నాదెండ్ల: దేశం నీకేమిచ్చింది అనేకంటే దేశానికి మనమేమిచ్చాం అనేదే ముఖ్యమని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధానమంత్రి మోడీ పిలుపు మేరకు మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీవో పుష్పరాజు, ఎంఈవో ఆంజనేయులు, ఏవో హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, మండలపార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, జెట్టి బొల్లయ్య, సింగారెడ్డి కోటిరెడ్డి, అల్లడి రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి



ఈపూరు: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని శ్రీనగర్ సమీపంలోని కోళ్లఫారంలో గురువారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు... ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నీలేంద్ర జానీ (35) కోళ్ల ఫారంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. ఈ క్రమంలో పనిచేస్తున్న సమయంలో కరెంటు షాక్ తగిలి మృతి చెందింది. బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ముగ్గురు సంతానం ఉన్నారు.

### 11న ముస్లింల బహిరంగ సభ

నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్‌నగర్ షాదీఖానా ప్రాంగణంలో వచ్చే నవంబరు 11వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు ముస్లిం సోదరులకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఇత్తెహాదుల్ ఉల్మావ అయిమ్మా కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక షాదీఖానా ప్రాంగణంలో గురువారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదుగంటల వరకు ప్రత్యేకంగా ముస్లిం మహిళలతో సమావేశం జరుగుతుందన్నారు.

### ఉపాధి హామీ పనులు గుర్తించాలి

నాదెండ్ల: రానున్న ఏడాదిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు లక్ష్యాలను పూర్తి చేసేందుకు పనులు గుర్తించాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో పుష్పరాజు, ఎంఈవో ఆంజనేయులు, ఏవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

### పాస్టర్ ఎలీషాకు ఘన సన్మానం

నరసరావుపేట: పాస్టర్స్‌డే సందర్భంగా స్థానిక టౌన్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ మున్నంగి ఎలీషా, ఆ చర్చి అనుబంధ గ్రామాల పాస్టర్లను గురువారం పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బాప్టిస్ట్ చర్చి విశ్వాసులు, చర్చి పాలకవర్గ చైర్మన్ పంగులూరి విజయకుమార్ ప్రసంగించారు. బాప్టిస్ట్ చర్చి సెక్రటరీ తలారి శ్యాము, కోశాధికారి తెలగలపూడి ఆనంద్ బెంజిమెన్, సువార్త కమిటీ చైర్మన్ జంగాల నవబాబు, పాలకవర్గం విశ్వాసులు పాల్గొన్నారు.

### ఆర్వోప్లాంట్ ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): పాత జెడ్డావారిపాలెం గ్రామంలో బాలవికాస నీటి శుద్ధికరణ పథకం క్రింద ఆర్వో ప్లాంట్‌ను నరరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంపీపీ జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జెడ్డాసుబ్బులు రామయ్య, మండల కన్వీనర్ నక్కానాగిరెడ్డి, కొమిరిశెట్టి రామారావు, పారా వెంకటేశ్వర్లు,లతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.





విప్పర్లలో జరిగిన రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొని శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజని. అనంతరం జరిగిన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
–నరసరావుపేట